
Crime Mirror
QR Code
https://epaper.crimemirror.com/

క్రైమ్ మిర్రర్®
Voice of Anti Corruption

హైదరాబాద్
30-12-2024
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:14
సంచిక:48

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

# రంగారెడ్డి జిల్లాకు ఎయిమ్స్ వర్సిటీ



- 200 ఎకరాల భూమి లభిస్తే ఏర్పాటు
- కన్హా శాంతివనం.. అద్భుత ప్రపంచం
- పర్యావరణానికి మీ సేవలు అమోఘం
- నిర్వాహకుడు కమలేశ్‌తో రేవంత్
- వర్సిటీకి స్థలం ఇస్తామన్న కమలేశ్

షాద్‌నగర్: దేశంలో ప్రఖ్యాతి గాంచిన ‘అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్)’ యూనివర్సిటీని రంగారెడ్డి జిల్లాలో ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. వర్సిటీ ఏర్పాటుకు 200 ఎకరాల భూమి అవసరమవుతుందన్నారు. భూమి దొరికితే ఎయిమ్స్ వర్సిటీని రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం రంగారెడ్డి జిల్లా చేగూరులోని

- మిగతా 2వ పేజీలో



పేలిపోయిన విమానం..

# 179 మంది దుర్మరణం

## దక్షిణ కొరియాలో ఘోరం.. బతికింది ఇద్దరే


- బ్యాంకాక్ నుంచి మువాన్ వచ్చిన ‘జెజు’ విమానం
- ల్యాండింగ్ గేర్ విఫలమవడంతోనే ప్రమాదం!
- పక్షి ఢీకొట్టడంతోనే విఫలమైందన్న అనుమానాలు
- మరో రెండు విమానాలకు తప్పిన ప్రమాదం
- కెనడా విహంగంలో మంటలు.. నార్వేలో మరో ఘటన

సియోల్, డిసెంబరు 29: దక్షిణ కొరియాలో ఘోర విమాన ప్రమాదం జరిగింది. రాజధాని సియోల్‌కు 290 కిలోమీటర్ల దూరంలోని మువాన్ నగరంలో ఉన్న అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆదివారం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్ నుంచి బయల్దేరిన జెజు ఎయిర్‌కు

- మిగతా 2వ పేజీలో

## టాలీవుడ్‌పై ‘అక్కినేని’ చెరగని ముద్ర

- తెలుగు సినిమాను కొత్త శిఖరాలకు తీసుకెళ్లారు
- రాజ్‌కపూర్, మొహమ్మద్ రఫీ, తపన్ సిన్హా
- జీవితాలు యావత్ సినీ పరిశ్రమకు స్ఫూర్తి
- ‘మన్ కీ బాత్’లో ప్రధాని నరేంద్ర మోదీ



2లో



## తెలంగాణలో నేరాల రేటు ఆందోళన కలిగిస్తోంది

- నేరాలు కాంగ్రెస్ సర్కార్ వైఫల్యానికి నిదర్శనం
- పోలీసులే ప్రాణాలు తీసుకోవడం విచారకరం
- మాజీ మంత్రి హరీశ్‌రావు

2లో



## హంపి అ‘ద్వితీయం’

- ప్రపంచ ర్యాపిడ్ చెస్ విజేతగా తెలుగు తేజం
- రెండోసారి టైటిల్‌తో కొత్త చరిత్ర
- ద్రోణవల్లి హారిక, అర్జున్‌లకు ఐదోస్థానం

తెలుగు తేజం, చెస్ ధ్రువతార కోనేరు హంపి విశ్వవేదికపై అద్భుత ప్రదర్శన కనబరచింది. న్యూయార్క్‌లో జరిగిన ఫిడే మహిళల ప్రపంచ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌గా నిలిచి అదరహో అనిపించింది. మొత్తం 11 రౌండ్లకు గాను 8.5 పాయింట్లు సాధించిన హంపి అగ్రస్థానంతో టైటిల్ కైవసం చేసుకుంది. 37 ఏళ్ల హంపికిది రెండో ర్యాపిడ్ ప్రపంచ టైటిల్ కావడం విశేషం. 2019లోనూ విజేతగా నిలిచిన హంపి.. చైనా గ్రాండ్‌మాస్టర్ జు వెన్‌జున్ తర్వాత ఈ టోర్నీని ఒకటికంటే ఎక్కువసార్లు గెలిచిన క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించింది. మరో తెలుగమ్మాయి ద్రోణవల్లి హారిక ఎనిమిది పాయింట్లతో ఐదోస్థానంతో సరిపెట్టుకుంది. ఓపెన్ విభాగంలో రష్యాకు చెందిన, 18 ఏళ్ల వొలొదార్ ముర్జిన్ ర్యాపిడ్ చాంపియన్‌గా అవతరించాడు. టైటిల్ ఫేవరెట్‌గా పోటీపడ్డ అర్జున్ ఇరిగేసి 9 పాయింట్లతో ఐదో స్థానానికి పరిమితమవగా.. ప్రజ్ఞానంద (8.5) 17వ, హర్ష భరత్‌కోటి (6.5) 98వ స్థానాలతో నిరాశపరిచారు.

2లో

# రైతు భరోసా ఎవరికి?

- సాగు చేసిన మొత్తం విస్తీర్ణానికి ఇద్దామా?
- ఆదాయపు పన్ను చెల్లింపుదారుల సంగతేంటి?
- సింగరేణి, 4వ తరగతి ఉద్యోగులకు ఇవ్వాల్సిందే
- కొండలు, గుట్టలు, రాళ్లు, రప్పలుంటే ఇవ్వొద్దు
- కటాఫ్‌ను ఏ ప్రాతిపదికన నిర్ణయిద్దాం?
- భట్టి ఆధ్వర్యంలో మంత్రివర్గ ఉపసంఘం భేటీ
- మరికొన్ని సార్లు సమావేశం కావాలని నిర్ణయం
- సమగ్ర అధ్యయనం తర్వాతే క్యాబినెట్‌కు సిఫారసు



హైదరాబాద్, : కొండలు, గుట్టలు, రాళ్లు, రప్పలున్న భూములను వదిలేసి... సాగు చేస్తున్న భూములకే రైతు భరోసా ఇద్దామా? ఆదాయపు పన్ను చెల్లింపుదారుల్లో ఏయే వర్గాలను మినహాయించాలి? ఎవరికి ఇవ్వాలి? సింగరేణి ఉద్యోగులకు, నాలుగో తరగతి ఉద్యోగులకు ఇవ్వొచ్చా? ఇవ్వకపోతే ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయి? వంటి పలు

- మిగతా 2వ పేజీలో

# కాలుష్య కారక పరిశ్రమలపై పవన్ కన్నెర్ర



- కాకినాడలో యూనివర్సల్ బయో ఫ్యూయల్ సంస్థ మూసివేత
- సమగ్ర దర్యాప్తునకు డిప్యూటీ సీఎం ఆదేశం
- తీరంలో ఆలివ్ రిడ్లే తాబేళ్ల మరణంపైనా విచారణ

అమరావతి: కాకినాడ తీరప్రాంతంలో దుర్గంధం వెదజల్లుతున్న పరిశ్రమల్లో తనిఖీలు చేపట్టాలని డిప్యూటీ సీఎం, పర్యావరణ, అటవీశాఖ మంత్రి పవన్ కల్యాణ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. తీర ప్రాంతంలో యూనివర్సల్ బయో?ఫ్యూయల్స్ సంస్థ విడుదల

- మిగతా 2వ పేజీలో

# పేలిపోయిన విమానం! 179 మంది దుర్మరణం

(మొదటిపేజీ తరువాయి)

చెందిన 7సి2216 నంబర్ బోయింగ్ 737%-%800 విమానం మువాన్ విమానాశ్రయంలో ల్యాండ్ అవుతూ అదుపుతప్పింది. ఈ విమానం 15 ఏళ్ల నాటిదని అధికారులు తెలిపారు. ఉదయం 9 గంటల సమయంలో రన్‌వే పైనుంచి అతివేగంగా దూసుకెళ్లి, రక్షణ గోడను ఢీకొని మంటల్లో చిక్కుకొని పేలిపోయింది. విమానంలో 175 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది ఉన్నట్లు అధికారులు తెలిపారు. వీరిలో 179 మంది మంటల్లో చిక్కుకొని, మరణించినట్లు వెల్లడించారు. ఇద్దరు సిబ్బందిని కాపాడారు. ప్రమాదానికి గల కారణాలపై వివిధ కోణాల్లో పరిశీలిస్తున్నట్లు తెలిపారు. విమానం ఇంజన్‌ను పక్షి ఢీకొనడం, ల్యాండింగ్ గేర్‌లో సమస్య ఈ ప్రమాదానికి కారణమై ఉండొచ్చని పేర్కొన్నారు. కాగా, ఈ విమానం అప్పటికే ల్యాండింగ్‌కు యత్నించి విఫలమైందని అధికారులు చెబుతున్నారు. నేలపైకి దిగిన తర్వాత, రన్‌వేపై వేగాన్ని నియంత్రించుకోవడంలో విఫలమైనట్లు చెప్పారు. విమానం నేలపైకి దిగే సమయంలో ల్యాండింగ్ గేర్, టైర్లు పనిచేయడం లేదని కొందరు ప్రత్యక్ష సాక్షులు చెప్పినట్లు అధికారులు వెల్లడించారు. ఏదైనా పక్షిని ఢీకొనడం వల్లే అవి పనిచేయకపోయి ఉండొచ్చన్న అనుమానాలున్నాయి. వీటిని బలపర్చేలా విమానం ల్యాండింగ్ సమయంలో ఓ ఇంజన్ నుంచి నిప్పులు వచ్చిన దృశ్యాలను స్థానిక టీవీ చానల్ ప్రసారం చేసింది. ప్రమాద వీడియోలో కూడా విమానం రన్‌వేపై అదుపుతప్పి దూసుకెళుతూ గోడను ఢీకొనే సమయానికి ల్యాండింగ్ గేర్ వెనక్కే ఉన్నట్లు భావిస్తున్నారు. విమానాన్ని పక్షి ఢీకొన్నట్లు ఎయిర్‌పోర్ట్ కంట్రోల్ టవర్ నుంచి సందేశం వెళ్లినట్లు ప్రాథమిక సమాచారం ఈ ప్రమాదం పట్ల థాయ్‌లాండ్‌కు చెందిన జెజు ఎయిర్ సంస్థ క్షమాపణలు తెలిపింది. బాధిత కుటుంబాలకు సాయం చేస్తామని పేర్కొంది. దక్షిణ కొరియాలో 1997లో జరిగిన విమాన ప్రమాదంలో 228 మంది మృతి చెందారు. ఆ తర్వాత ఇదే అతిపెద్ద ప్రమాదం కావడం గమనార్హం. కాగా, ఈ విమాన ప్రమాదంపై దక్షిణ కొరియా తాత్కాలిక అధ్యక్షుడు చోయ్ సాంగ్ స్పందించారు. తక్షణమే అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

**నా చివరి మాటలు చెప్పనా?**

మువాన్‌లో విమాన ప్రమాదం జరగడానికి కొన్ని క్షణాల ముందు ఓ ప్రయాణికుడు తన బంధువుకు పంపిన మెసేజ్ వైరల్‌గా మారింది. విమానం రెక్కలో పక్షి ఇరుక్కుందని మెసేజ్‌లో తెలిపారు. తర్వాత 'నా చివరి మాటలు చెప్పనా?' అని ఉన్నట్లు ఓ వార్తా సంస్థ తెలిపింది.



# కాలుష్య కారక పరిశ్రమలపై పవన్ కన్నెర్ర

(మొదటిపేజీ తరువాయి)

చేస్తున్న కాలుష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన ఆదేశాలతో కాకినాడ రూరల్ మండలం వాకలపూడిలోని ఈ ఫ్యాక్టరీని పరిశీలించిన కాలుష్య నియంత్రణ మండలి అధికారులు.. దీనిని తాత్కాలికంగా మూసివేయించారు. కొంతకాలంగా వాయు కాలుష్యంపై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండటంపై డిప్యూటీ సీఎం పవన్ స్పందించారు. పీసీబీ చైర్మన్ కృష్ణయ్య, జిల్లా పీసీబీ ఈఈ శంకరరావులతో ఫోన్‌లో మాట్లాడారు. యూనివర్సల్ బయో ఫ్యూయల్స్ సంస్థ కాలుష్య నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు, వాస్తవ పరిస్థితిని పరిశీలించి తక్షణం నివేదిక అందజేయాలని ఆదేశించారు. ప్రజలకు వాయు కాలుష్య సమస్యలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ఈమేరకు అధికారులు ఇటీవల క్షేత్రస్థాయిలో తనిఖీలు చేశారు. అక్కడ ముడి పదార్థాల కింద వాడే ఫ్యాటీ యాసిడ్‌లో కల్తీ జరిగిందని, ఫలితంగా ఘాటైన, దుర్గంధపూరిత వాయువులు వెలువడుతున్నాయని తేల్చారు. సదరు కంపెనీకి నోటీసులు జారీ చేశారు. ముడి సరుకు ధరలు పెరడంతో కల్తీ రసాయనం వాడినట్టు ప్రాథమికంగా గుర్తించామని, ఈ నెల 24న ఫ్యాక్టరీని మూసివేయించామని పీసీబీ ఈఈ శంకరరావు తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్ ఆదేశాల మేరకు మరింత సమగ్రంగా దర్యాప్తు చేస్తామని, సముద్ర తీర ప్రాంతంలోని మరిన్ని ఫ్యాక్టరీల్లో తనిఖీలు నిర్వహిస్తామని చెప్పారు. అలాగే, కాకినాడ బీచ్‌రోడ్డు, ఏపీఐఐసీ, వాకలపూడి ప్రాంతాల్లో అరుదైన ఆలివ్ రిడ్లే తాబేళ్లు పెద్ద సంఖ్యలో మరణిస్తున్న విషయం డిప్యూటీ సీఎం దృష్టికి రావడంతో దీనిపై విచారణ జరిపి, తాబేళ్ల మరణానికి కారకులపై చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వన్యప్రాణుల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై సమగ్ర అధ్యయనం చేయాలని పీసీసీఎఫ్ చిరంజీవ్ చౌదరిని ఆదేశించారు.

# బీజేపీ చీఫ్‌గా దళితుడు?

**దక్షిణాది నుంచి యువనేతకు చాన్స్!**

న్యూఢిల్లీ, డిసెంబరు 29: బీజేపీ సంస్థాగత ఎన్నికలు పూర్తయిన తర్వాత జనవరి లేదా ఫిబ్రవరి చివరి నాటికి ఆ పార్టీకి కొత్త అధ్యక్షుడు రానున్నారు. ప్రస్తుత బీజేపీ చీఫ్ జేపీ నడ్డా స్థానంలో దళిత వర్గానికి చెందిన యువనేతను ఎంపిక చేయవచ్చని ఢిల్లీ వర్గాలు చెబుతున్నాయి. ఇందుకు మూడు కారణాలు ఉన్నాయని విశ్లేషిస్తున్నారు. ఇటీవల అంబేడ్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం కావడం, కాంగ్రెస్ అధ్యక్షుడిగా దళిత వర్గానికి చెందిన ఖర్గే ఉండటం, బీజేపీ దళితులకు వ్యతిరేకమని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో దళితుడికి పార్టీ పగ్గాలు అప్పగించాలని బీజేపీ అగ్రనాయకత్వం భావిస్తున్నట్టు చెబుతున్నారు. కాగా దక్షిణాది రాష్ట్రాలకు చెందిన నేతను బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా నియమించే అవకాశముందని పార్టీ వర్గాలు తెలిపాయి.



# రంగారెడ్డి జిల్లాకు ఎయిమ్స్ వర్సిటీ

(మొదటిపేజీ తరువాయి)



కన్హా శాంతివనాన్ని సందర్శించారు. శాంతివనం నిర్వాహకుడు కమలేశ్ పటేల్‌తో సుమారు రెండు గంటల పాటు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎయిమ్స్ వర్సిటీ ఏర్పాటుపై చర్చ జరిగింది. అయితే వర్సిటీ ఏర్పాటుకు అవసరమైన భూమిని ఇచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని కమలేశ్ సీఎంతో చెప్పినట్లు తెలిసింది. కన్హా శాంతివనం తెలంగాణకు గర్వకారణంగా నిలుస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కన్హా శాంతివనం అద్భుత ప్రపంచమని.. ఇక్కడ పెద్దఎత్తున మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం అభినందనీయమని సీఎం కొనియాడారు. శాంతివనం గురించి విన్నానని, ఇప్పుడు ప్రత్యక్షంగా చూస్తుంటే ఎంతో ఆహ్లాదకరంగా ఉందని చెప్పారు. యోగా, ధ్యానం, పర్యావరణ సంరక్షణ గురించి ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల వల్ల దేశానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తున్న శాస్త్రవేత్తలను ప్రోత్సహించడంతో పాటు కాలుష్య నివారణకు చేపడుతున్న కార్యక్రమాలు బాగున్నాయని కమలేశ్‌ను ప్రశంసించారు. అలాగే శాంతివనంలో సాఫ్ట్ స్కిల్స్, కళ్లకు గంతలు కట్టుకుని రంగులను గుర్తించడం, పదాలను చదవడం వంటి విద్యార్థుల నైపుణ్యాలను చూసిన సీఎం.. వారిని అభినందించారు. శాంతివనంలోని రెయిన్ ఫారెస్ట్, టిష్యూ కల్చర్ ల్యాబ్‌ను పరిశీలించారు. అనంతరం కమలేశ్ పటేల్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి రేవంత్‌రెడ్డి మొక్కను నాటారు.

**బ్యాటరీ కారులో వనంలో తిరిగిన సీఎం**

సుమారు 1400 ఎకరాల్లో విస్తరించి ఉన్న కన్హా శాంతివనాన్ని సీఎం రేవంత్ బ్యాటరీ కారులో కూర్చొని కలియతిరిగారు. ఆయన వెంట షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి ఉన్నారు. శాంతివనంలో ఉన్న వివిధ దేశాల మొక్కలు, వాటి అవసరాల గురించి కమలేశ్ పటేల్‌ను అడిగి తెలుసుకున్నారు. ఇంతటి ప్రశాంత వాతావరణాన్ని కల్పించడం పట్ల సీఎం హర్షం వ్యక్తం చేస్తూ తీరిక ఉంటే మళ్లీ వచ్చేందుకు ప్రయత్నం చేస్తానని చెప్పారు. కాగా, సీఎం కోసం షాద్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సుమారు 3 గంటల పాటు ఆయన రాక కోసం ఎదురు చూశారు. శాంతివనం నుంచి తిరిగి వెళ్లేటప్పుడు సీఎం రేవంత్ పార్టీ కార్యకర్తలకు అభివాదం చేశారు.

**శాంతివనం ప్రతినిధులతో మంత్రి పొన్నం భేటీ**

సీఎం రేవంత్ కంటే ముందుగా కన్హా శాంతివనాన్ని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సందర్శించారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి శాంతివనం ప్రతినిధులతో సమావేశమయ్యారు. వారు చేపడుతున్న కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ధ్యాన కేంద్రాన్ని తెలంగాణలో నిర్మించడం ఇక్కడి ప్రజల అదృష్టమని చెప్పారు.

**రైజింగ్ తెలంగాణ కల సాకారం**

తెలంగాణలో ఏర్పడిన ప్రజాప్రభుత్వ సంకల్పంతో రైజింగ్ తెలంగాణ కల సాకారమవుతోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల(ఎఫ్‌డీఐ) సాధనలో రాష్ట్రం గర్వించదగ్గ వృద్ధిని సాధించిందని హర్షం వ్యక్తం చేశారు. ప్రమాణ స్వీకారం చేసిన మొదటి నెల నుంచే దావోస్, అమెరికా, దక్షిణ కొరియాల్లో పర్యటించి, పెట్టుబడుల సాధన కోసం చేసిన ప్రయత్నాలు మంచి ఫలితాలు ఇస్తున్నాయని తెలిపారు. 2023 ఏప్రిల్–సెప్టెంబరుతో పోలిస్తే.. 2024 ఏప్రిల్–సెప్టెంబరులో అద్భుత లక్ష్యాలను సాధించామని, రూ.12,864 కోట్ల ఎఫ్‌డీఐల సాధనతో 33 శాతం వృద్ధిని నమోదు చేశామని వివరించారు. ఈ పురోగతిలో సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుతూ సీఎం రేవంత్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు.

# తెలంగాణలో నేరాల రేటు ఆందోళన కలిగిస్తోంది

హైదరాబాద్: గత ఏడాదితో పోలిస్తే.. తెలంగాణలో నేరాలరేటు 22.5% పెరగడం ఆందోళనకరమని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. రాష్ట్రంలో మహిళలు, బాలికలపై అఘాయిత్యాలు పెరగడం బాధాకరమన్నారు. ఆదివారం ఆయన ఈ మేరకు ఎక్స్‌లో పలు వ్యాఖ్యలు చేశారు. నేరాల సంఖ్య పెరగడం కాంగ్రెస్ సర్కారు వైఫల్యానికి నిదర్శనమన్నారు. "అత్యాచార కేసులు 28.9% పెరిగాయి. ఏడాదిలో 2,945 అత్యాచారం కేసులు నమోదయ్యాయి. అంటే.. రోజుకు సగటున 8 కేసులు. 82 శాతం అపహరణ కేసులు బాలికలకు సంబంధించినవి కావడం ఈ ప్రభుత్వానికి సిగ్గుచేటు. కాంగ్రెస్ పాలనలో మహిళలకు భద్రత లేదని ఈ గణాంకాలు తేటతెల్లం చేస్తున్నాయి" అని వ్యాఖ్యానించారు. నాలుగు నెలల క్రితం అంబర్‌పేటలో రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ గంగారెడ్డి, ఆయన భార్య హత్య కేసు ఇంకా పరిష్కృతమవ్వలేదని ఆరోపించారు. ఆర్నెల్ల క్రితం బీఆర్ఎస్ నేత శ్రీధర్‌రెడ్డి హత్య కేసులోనూ నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. "163కు పైగా కీలక కేసుల్లో పరిష్కారమే లేదు. రూ.10 కోట్ల విలువైన ఆర్థిక నేరాల్లో రికవరీలు లేవు. నేరాల తీరును చూస్తుంటే బిహార్ వంటి రాష్ట్రాలతో తెలంగాణ పోటీపడే పరిస్థితులు కనిపిస్తున్నాయి. హోంశాఖను కూడా నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి పాలనావైఫల్యానికి ఇది నిదర్శనం. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించడానికి రేవంత్‌రెడ్డి కారణం" అని ఆరోపించారు. మరోవైపు.. సోషల్ మీడియాలో అభిప్రాయాలు వ్యక్తం చేసేవారిని వేధింపులకు గురిచేస్తున్నారని, ఆఖరికి పేరు మరిచిపోతే కూడా కేసులు పెట్టి, హింసించడం దారుణమన్నారు. "రాష్ట్రంలో క్రైం రేటు ను తగ్గించడానికి బడ్జెట్‌ను విడుదల చేసి, పోలీసు శాఖను బలోపేతం చేయాలి. ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన పోలీసులే.. వరుసగా బలవన్మరణాలకు పాల్పడడం ఆందోళన కలిగిస్తోంది. ములుగులో ఎస్సై, సిద్దిపేటలో కానిస్టేబుల్ కుటుంబం, కామారెడ్డిలో ఓ ఎస్సై, కానిస్టేబుల్, సిరిసిల్లలో కానిస్టేబుల్ కుటుంబం, మెదక్ జిల్లా కొల్చారంలో హెడ్‌కానిస్టేబుల్.. ఇలా పోలీసులు ఆత్మహత్యలకు పాల్పడడం విచారకరం. ఈ ఆత్మహత్యలపై శాఖాపరమైన దర్యాప్తు చేయాలని డీజీపీని కోరుతున్నాం" అని విజ్ఞప్తి చేశారు.

# టాలీవుడ్‌పై 'అక్కినేని' చెరగని ముద్ర

న్యూఢిల్లీ,:ప్రముఖ సినీనటుడు అక్కినేని నాగేశ్వరరావు తెలుగు సినిమాను కొత్త శిఖరాలకు తీసుకెళ్లారని ప్రధాని మోదీ కొనియాడారు. తన కళా వారసత్వంతో టాలీవుడ్‌పై చెరగని ముద్ర వేశారని తెలిపారు. ఆయన సినిమాల్లో భారతీయ సంప్రదాయాలు, విలువలు ఉట్టిపడేవని పేర్కొన్నారు. ఆదివారం 'మన్ కీ బాత్' 117వ ఎపిసోడ్‌లో భాగంగా ఆయన పలు అంశాలపై ప్రసంగించారు. అక్కినేనితో పాటు రాజ్‌కపూర్, మొహమ్మద్ రఫీ, తపన్ సిన్హా భారతీయ సినిమాకు ప్రపంచస్థాయిలో గుర్తింపు తెచ్చారని ప్రశంసించారు. వీరి జీవితాలు యావత్ సినీ పరిశ్రమకు స్ఫూర్తిదాయకమని వ్యాఖ్యానించారు. వీరి సినిమాలు సామాజిక స్పృహ, జాతీయ ఐక్యత సందేశాన్ని కలిగి ఉంటాయని తెలిపారు. ప్రస్తుతం ప్రపంచ దేశాలు భారతీయ చలనచిత్ర రంగంవైపు చూస్తున్నాయని అన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో తొలిసారిగా వరల్డ్ ఆడియో, విజువల్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్ (వేవ్స్)ను మన దేశంలో నిర్వహించనున్నట్లు ప్రధాని తెలిపారు. ప్రపంచ కంటెంట్ సృష్టి కేంద్రంగా భారత్‌ను తీర్చిదిద్దే దిశగా ఈ సదస్సు ఒక ముఖ్యమైన అడుగుగా మోదీ అభివర్ణించారు.

ఉత్తరప్రదేశ్‌లో జనవరి 13 నుంచి జరగనున్న మహాకుంభ మేళా ఐక్యతా సందేశాన్ని ఇస్తుందని మోదీ అన్నారు. విభిన్న ప్రాంతాలకు చెందిన ప్రజలు హాజరయ్యే ఈ కార్యక్రమం భిన్నత్వంలో ఏకత్వానికి చక్కటి నిదర్శనమన్నారు. ఈసారి డిజిటల్ మహాకుంభ్‌ను దేశంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భక్తులు వీక్షిస్తారని, కుంభమేళాలో తొలిసారి ఏఐ చాట్‌బాట్ సేవలు వినియోగించనున్నట్లు తెలిపారు. చాట్ బాట్‌లో కుంభ్‌కు సంబంధించి అన్ని రకాల సమాచారం 11 భారతీయ భాషల్లో అందుబాటులో ఉంటుందన్నారు. ప్రభుత్వం ఆమోదించిన టూర్ ప్యాకేజీలు, వసతి, హోమ్‌స్టే గురించి భక్తులకు వారి మొబైల్ ఫోన్లకు సమాచారం అందించనున్నట్లు మోదీ వివరించారు. కాగా, 2015%-%23 మధ్య కాలంలో దేశంలో మలేరియా కేసులు, మరణాల సంఖ్య 80% తగ్గిందని డబ్ల్యూహెచ్‌వో నివేదిక పేర్కొందని, ప్రధాని అన్నారు.

# రైతు భరోసా ఎవరికి?

(మొదటిపేజీ తరువాయి)

అంశాలపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం ఆదివారం సుదీర్ఘంగా చర్చించింది. సమావేశంలో తొలుత రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం, ఉపసంఘం పలు అంశాలపై చర్చలను ప్రారంభించింది. గతంలో ఉమ్మడి జిల్లాలవారీగా నిర్వహించిన సదస్సుల్లో వ్యక్తమైన అభిప్రాయాలు, అధికారులు తయారుచేసిన నివేదికలపై చర్చించారు. ఉపసంఘం చేపట్టిన క్షేత్రస్థాయి పర్యటనల్లో ఆదాయపు పన్ను చెల్లింపుదారులకు రైతుభరోసా ఇవ్వొద్దనే అభిప్రాయాలు వ్యక్తమైన విషయం ప్రస్తావనకు వచ్చింది. అయితే, ఐటీ చెల్లించే సింగరేణి ఉద్యోగులు ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లో సుమారు 4 లక్షల మంది ఉన్నారని, వీరందరికి ఇవ్వకపోతే ఇబ్బంది అవుతుందనే అభిప్రాయాలు వ్యక్తమైనట్లు సమాచారం. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పీఎం%-% కిసాన్ పథకం మార్గదర్శకాలు కూడా ఉపసంఘం భేటీలో చర్చకు వచ్చాయి. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదార్లు, ఐదేళ్లలో మూడుసార్లు లేదా వరుసగా రెండేళ్లు ఐటీ చెల్లించినవారు, వైద్యులు, ఇంజినీర్లు, న్యాయవాదులు, సీఏలు, ఆర్కిటెక్టులు వంటి వృత్తి నిపుణులకు పీఎం%-% కిసాన్ పథకాన్ని వర్తింపచేయటం లేదు. అయితే, దీనిని రాష్ట్రంలో పూర్తిగా అనుసరించలేమని, కొన్ని వర్గాలను మినహాయించి మిగిలిన వర్గాలకు రైతుభరోసా ఇవ్వాలని మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు దాదాపు ఏకాభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం. అందులో తప్పనిసరిగా సింగరేణి ఉద్యోగులు, నాలుగో తరగతి ఉద్యోగులు ఉండేలా చూడాలని భావించారు. గడిచిన ఆరేళ్లలో పెట్టుబడి సాయం పొందిన రైతుల సంఖ్య, సాగవుతున్న భూ విస్తీర్ణం, బడ్జెట్ కేటాయింపులపైనా చర్చించారు. మొత్తం కలిపి రూ.80,453 కోట్లు చెల్లించగా... ఇందులో సాగు చేయని భూములకు రూ.21,284 కోట్లు చెల్లించినట్లు వ్యవసాయశాఖ అధికారులు నివేదికలో పేర్కొన్నారు. ఈ అంశంపై ఉపసంఘం సభ్యులు దృష్టి సారించారు.

# హంపి అ'ద్వితీయం'

న్యూయార్క్: ఈ ఏడాది విశ్వ చదరంగ వేదికపై మరోసారి భారత పతాకం రెపరెపలాడింది. ప్రపంచ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్ మహిళల విభాగంలో భారత నంబర్‌వన్ కోనేరు హంపి విజేతగా నిలిచింది. భారత కాలమానం ప్రకారం ఆదివారం తెల్లవారుజామున ముగిసిన ర్యాపిడ్ టోర్నీలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 37 ఏళ్ల హంపి టైటిల్‌ను సొంతం చేసుకుంది. 110 మంది క్రీడాకారిణల మధ్య స్విస్ ఫార్మాట్‌లో 11 రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీలో హంపి 8.5 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి టైటిల్‌ను దక్కించుకుంది. విజేతగా నిలిచిన హంపికి 60 వేల డాలర్ల (రూ. 51 లక్షల 23 వేలు) ప్రైజ్‌మనీ లభించింది. 10వ రౌండ్ ముగిశాక హంపితోపాటు మరో ఆరుగురు క్రీడాకారిణులు జు వెన్‌జున్ (చైనా), కాటరీనా లాగ్నో (రష్యా), టాన్ జోంగి (చైనా), ఇరినె ఖరిస్మా సుకందర్ (ఇండోనేసియా), ద్రోణవల్లి హారిక (భారత్), అఫ్రూజా ఖమ్‌దమోవా (ఉజ్బెకిస్తాన్) 7.5 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచి టైటిల్ రేసులో నిలిచారు. అయితే చివరిదైన 11వ రౌండ్ గేమ్‌లో నల్ల పావులతో ఆడిన హంపి 67 ఎత్తుల్లో ఖరిస్మా సుకందర్‌పై గెలుపొందడం... జు వెన్‌జున్, కాటరీనా లాగ్నో, హారిక, టాన్ జోంగి, అఫ్రూజా తమ గేమ్‌లను 'డ్రా' చేసుకోవడంతో హంపికి టైటిల్ ఖరారైంది. 8 పాయింట్లతో జు వెన్‌జున్, కాటరీనా లాగ్నో, టాన్ జోంగి, హారిక, అఫ్రూజా, అలెగ్జాండ్రా కొస్టెనిక్ (స్విట్జర్లాండ్) ఉమ్మడిగా రెండో స్థానంలో నిలిచారు. మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ఈ ఆరుగురి ర్యాంకింగ్‌ను వర్గీకరించారు. జు వెన్‌జున్‌కు రెండో స్థానం, కాటరీనాకు మూడో స్థానం లభించాయి. టాన్ జోంగి నాలుగో స్థానంలో, హారిక ఐదో స్థానంలో, కొస్టెనిక్ ఆరో స్థానంలో, అఫ్రూజా ఏడో స్థానంలో నిలిచారు.

**ఓటమితో మొదలు... గెలుపుతో ముగింపు**

ఈసారి ప్రపంచ చాంపియన్‌షిప్‌లో హంపి 10వ సీడ్‌గా బరిలోకి దిగింది. తొలి రౌండ్‌లో అమీనా కైర్‌బెకోవా (కజకిస్తాన్) చేతిలో హంపి ఓడిపోయింది. ఆ తర్వాత రెండో రౌండ్‌లో జేనాబ్ (అజర్‌బైజాన్)పై, మూడో రౌండ్‌లో సలోమి మెలియా (జార్జియా)పై గెలిచి... అల్మీరా (ఫ్రాన్స్)తో నాలుగో రౌండ్ గేమ్‌ను 'డ్రా' చేసుకుంది. తొలి రోజు నాలుగు రౌండ్‌లు ముగిశాక హంపి 2.5 పాయింట్లతో 38వ స్థానంలో ఉంది. రెండో రోజు హంపి అద్భుతంగా ఆడింది. ఆడిన నాలుగు రౌండ్‌లలోనూ గెలిచింది. జెన్నిఫర్ యు (అమెరికా)పై, వంతిక అగర్వాల్ (భారత్)పై, తుర్మంక్ ముంఖ్‌జుల్ (మంగోలియా)పై, నినో బత్సియాష్‌విలి (జార్జియా)పై హంపి విజయం సాధించింది. ఎనిమిది రౌండ్‌లు ముగిశాక హంపి 6.5 పాయింట్లతో జు వెన్‌జున్, హారికలతో కలిసి సంయక్తంగా అగ్రస్థానానికి చేరుకుంది. చివరిరోజు జు వెన్‌జున్, కాటరీనాలతో జరిగిన గేమ్‌లను 'డ్రా' చేసుకున్న హంపి చివరి గేమ్‌లో ఖరిస్మాపై గెలిచి టాప్ ర్యాంక్‌ను ఖరారు చేసుకుంది.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
సోమవారం 30-12-2024


# విజయ్ జెబి ఇన్ఫ్రా ఆధ్వర్యంలో మరొక నూతన వెంచర్ ప్రారంభం




**222 ఎకరాల మెగా వెంచర్ ప్రారంభం**

**ఔటర్ రింగ్ రోడ్డు, రామోజీ ఫిలిం సిటీ దగ్గరలో జెబి టెర్రా గ్రీన్హిల్స్ వెంచర్**

**అన్ని ప్రభుత్వ అనుమతులతో కూడుకున్న వెంచర్ ప్రారంభోత్సవం**



**క్రైమ్ మిర్రర్, హైదరాబాద్ :** ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ మరొక సరికొత్త వెంచర్ ను తూప్రాన్ పేటలో ఆదివారం సరికొత్త హంగులతో అట్టహాసంగా ప్రారంభోత్సవం జరిగింది. చైర్మన్,సీఎండీ చింతిరెడ్డి విజయ్ రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ రంగంలో విజయ్ జెబి ఇన్ఫ్రా సరికొత్త సంచలనలకు కేరాఫ్ అడ్రస్ గా మారిందని తెలిపారు. కష్టమర్ల మన్నలను చురకొని అతి తక్కువ కాలంలో అగ్రగామిగా మా సంస్థ నిలిచిందని అన్నారు. తూప్రాన్ పేటలో జేబీ టెర్రగ్రీనిహిల్స్ వెంచర్ అద్భుతం సృష్టించబోతుందని అన్నారు. రామోజీ ఫిలిం సిటీకి దగ్గర్లో ,విజయవాడ హైవేకు అనుకొని ఔటర్ రింగ్ రోడ్ నుంచి చాలా తక్కువ దూరంలో ఈ వెంచర్ ఉందని తెలిపారు. మొత్తం 222 మెగా వెంచర్ ను ఘనంగా లాంచ్ చేశామని తెలిపారు. ఐదు ఎకరాల క్లబ్ రోజున నిర్మిస్తున్నామని అన్నారు. సామాన్య ప్రజలు కూడా సొంతింటి కల నెరవేర్చుకునే విధంగా ధరలు నిర్ణయించామని తెలిపారు. బ్యాంకు లోన్ కూడా అందుబాటులో ఉందని, కష్టమర్లు అవకాశాన్ని కూడా వినియోగించుకోవచ్చని తెలిపారు. అన్ని ప్రభుత్వ అనుమతులతో కుడుకున్న హెచ్ఎండిఎ ,డీటీసీపీ ,టిస్ రేరా మా సంస్థకు ఉందన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, అండర్ గ్రౌండ్ ఎలక్ట్రిసిటీ, వాకింగ్ ట్రాక్లను ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్స్ అశోక్ రావు, తిరుపతయ్య, అంజి రామ్, బీరప్ప,దయాకర్ రెడ్డి, మార్కెటింగ్ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## టైటిల్ ప్రజల భద్రతలో భాగంగా ఎలాంటి సంఘటన జరిగిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకునేలా QRT టీమ్ ల ఏర్పాటు

**క్రైమ్ మిర్రర్ 29 డిసెంబర్ పెద్దపల్లి జిల్లా:** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధి కి ఎంపిక కాబడిన నూతన ఆర్ముడు కానిస్టేబుల్స్ లకు రామగుండం కమిషనరేట్ పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో ఈరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది అట్టి కార్యక్రమానికి రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీ ఎం. శ్రీనివాస్ ఐపీఎస్ ఐజి హాజరై సిబ్బంది యొక్క స్కాడ్ డ్రిల్, పరేడ్, మాబ్ ఆపరేషన్ డ్రిల్, స్పెషల్ పార్టీ విధులు, కుంబింగ్ విధులు మరియు వివిధ బందోబస్త్ లలో రోప్ పార్టీ విధులు మరియు వారు చేయవలసిన విధులు, చేయకూడని విధుల గురించి, అత్యవసర పరిస్థితులలో పోలీస్ యంత్రాంగం తీసుకోవాల్సిన చర్యలను గురించి పలు సూచనలు సిబ్బంది కి సీపీ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ... కమీషనరేట్ పరిధిలోని ప్రజలకు పోలీసులు నిరంతరం అందుబాటులో ఉంటూ చట్ట పరిధిలో ప్రజల సమస్యలను పరిష్కారం చేస్తూ ప్రజల భద్రత ప్రధాన లక్ష్యం గా విధులు నిర్వహించడం జరుగుతుంది అని అన్నారు. శాంతి భద్రతల సంరక్షణకు, అత్యవసర పరిస్థితి లలో అనుగుణంగా QRT, స్పెషల్ పార్టీ సిబ్బంది కి శిక్షణ ఇవ్వడం జరుగుతుంది అన్నారు( QRT) బలగాలను విస్తృతంగా వినియోగించి లా&ఆర్డర్ నిర్వహించడంలో, ఏదైనా నిరసనలకు వెంటనే స్పందించడంలో, మరియు ఈ కీలక సమయంలో పౌరుల భద్రతను నిర్ధారించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని తెలిపారు. కమీషనరేట్ లో ఏదైనా అత్యవసర పరిస్థితి లేదా చట్టవిరుద్ధ కార్యకలాపాలు సంభవిస్తే వెంటనే స్పందించేందుకు QRT బృందాలు వ్యూహాత్మకంగా నివారించడానికి విధులు నిర్వహిస్తాయన్నారు .ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి రాజు ఏ ఆర్ ఏసీపీ సుందర్ రావు, ఆర్ఐ లు దామోదర్, శ్రీనివాస్, సంపత్, ఆర్ ఎస్ ఐ లు పాల్గొన్నారు.



## కోదాడ లో వ్యభిచారం ఆరుగురు అరెస్ట్

**కోదాడ డిసెంబర్ 29 క్రైమ్ మిర్రర్ :** కోదాడ టౌన్ లోని నయానగర్ మరియూ శ్రీమన్నారాయణకాలనీ నందు నివాస గృహాలలో వ్యభిచారం నిర్వహిస్తున్నారని నమ్మదగిన సమాచారం రాగా కోదాడ టౌన్ పోలీసు అధికారులు మరియూ సిబ్బందితో వెళ్ళి తనిఖీ చేయగా నయానగర్ నందు ఇద్దరు మహిళా వ్యభిచార నిర్వాహకులు, ఒక విటుడు, అదే విధంగా శ్రీమన్నారాయన కాలనీ నందు ఇద్దరు మహిళా ఆర్గనైజర్ లు, ఒక విటుడు మొత్తం నలుగురు మహిళా ఆర్గనైజర్లు, ఇద్దరు విటులు అయిన కరిశ రమేశ్, సుల్తాన్ రాజు లను అదుపు లోకి తీసుకోనైనది. మొత్తం (6) మంది అనగా నలుగురు మహిళా ఆర్గనైజర్లు, ఇద్దరు విటులు మరియూ ముగ్గురు భాదిత మహిళలు అట్టి నయానగర్, శ్రీమన్నారాయన కాలనీ లను ఆధీనం లోకి తీసుకోనైనది. ఈ ఆర్గనైజర్లు ఇళ్లు కిరాయికి తీసుకుని ఇతర ప్రాంతాల నుండి భాదిత మహిళలను ప్రలోభ పెట్టి వ్యభిచారం నిర్వహిస్తున్నారు. వీరి వద్ద నుండి (6) మొబైల్ ఫోన్లు, రూ. 1,500/- నగదు స్వాధీనం చేసుకోనైనది. ఇట్టి (6) మంది పై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించబడును అని కోదాడ టౌన్ %జ×౧%. రాము ఒక పత్రికా ప్రకటన లో తెలిపినారు.

# మట్టి మాఫీయా

### అడ్డగోలుగా మట్టి తవ్వకాలు

### పట్టించుకోని అధికారులు

### ప్రభుత్వ ఆదాయానికి గండి



**కోదాడ, డిసెంబరు 29(క్రైమ్ మిర్రర్):** అక్రమంగా మట్టి తరలింపు కోదాడ మండలంలో యదేచ్ఛగా కొనసాగుతుంది. మండల పరిధిలోని కూచిపూడి గ్రామ శివారు సర్వే నంబర్ 542,543,544,545,546,547,548 గల సుమారు 5 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఈ వ్యవహారం అనునిత్యం కొనసాగుతూనే ఉంది.మైనింగ్ శాఖ ,రెవెన్యూ శాఖ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు చేపడుతున్నారని గ్రామస్తులు తెలిపారు.సొంత పట్టాకలిగిన భూముల నుండి కూడా మట్టి తవ్వకాలు చేపట్టాలంటే వాటికి సంబంధించిన అధికారుల నుండి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.కాని వాటిని బేఖాతరు చేస్తూ అలవాటు పడిన కొంతమంది వ్యాపారస్తులు యదేచ్ఛగా గుట్టల మట్టిని కోదాడ పట్టణం లోని వెంచర్లకు ,ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. కోదాడ మండలంలో జరుగుతున్న మట్టి దందా పై మైనింగ్, పోలీస్, రెవెన్యూ విభాగాల అధికారులు ఆరా తీస్తున్నట్టుగా పైకి చెబుతున్నా లోలోన మాత్రం అధికార పార్టీ నాయకుల అండ తో యదేచ్ఛగా ఈ దందా సాగిస్తున్నట్లు తెలుస్తోంది.లేకపోతే అడ్డు అదుపు లేకుండా, విచ్చలవిడిగా టన్నుల కొద్ది మట్టిని వ్యాపారాలు ఎలా తరలిస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు.పది రోజుల నుండి రాత్రి అయితే చాలు వందల టిప్పర్ల మట్టి అక్రమ రవాణా చేస్తూ,పై పొలాలకు వెళ్లే రోడ్డును ఆక్రమించి యదేచ్ఛగా గుట్టల మట్టి అక్రమ రవాణాపై గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంపై కూడా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.ఇలాంటి అక్రమ మట్టి దందా పై సంబంధిత విభాగాల అధికారులు అందరూ దృష్టి సారించి కట్టడి చేయాలని, లేకపోతే గుట్టలు కనుమరుగు అయ్యే పరిస్థితి ఉంటుందని పలువురు గ్రామస్తులు అంటున్నారు.అంతేకాదు అక్రమ మట్టి తరలింపును అడ్డుకొని ప్రభుత్వ ఆదాయాన్ని పెంచాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు.

## ప్రయివేటు బస్సులో డ్రగ్స్

### చాక్లెట్స్ పాన్ మసాలా పాకెట్స్ గా మార్చిన వైనం

### విచారిస్తున్న అప్కారి పోలీసులులి





**కోదాడ డిసెంబర్ 29 క్రైమ్ మిర్రర్ :** కోదాడ మండల పరిధిలోని నల్లబండగూడెం అంతర్రాష్ట్ర చెక్ పోస్ట్ వద్ద డ్రగ్స్ దొరికిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం భువనేశ్వర్ నుంచి హైదరాబాద్ కు వెళు_న్న ప్రైవేట్ బస్సులో వాహనాల తనీకి సమయంలో డ్రగ్స్ ప్యాకెట్స్ ను పట్టుకున్న ఆబ్కారీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బస్సును, బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులను ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. వాటిని పరిశీలించగా చాక్లెట్ , పాన్ మసాలా రూపంలో ఉన్నాయని వాటిని ల్యాబ్ పరీక్షల అనంతరం వివరాలు వెల్లడిస్తామని ఆబ్కారీ పోలీసు అధికారులు తెలిపారు.బస్సులో ఉన్న డ్రగ్స్ బ్యాగు తమది కాదు అని ప్రయాణికులు తెలపడంతో ప్రయాణికుల్ని, బస్సు డ్రైవర్ ని ఆబ్కారీ పోలీసులు విచారిస్తున్నారు. కొంతమంది బస్ స్టార్టింగ్ పాయింట్ వద్ద ఎక్కకుండా బంకు వద్ద కొంతమంది ఎక్కడంతో వారిని విచారిస్తున్నట్లు తెలిపారు.పట్టుబడిన డ్రగ్స్ ప్యాకెట్ల విలువను అంచనా వేస్తున్నట్లు ఆబ్కారీ పోలీసు అధికారులు తెలిపారు.

# నూతన సంవత్సర వేడుకలు జరుపుకునే వారు జాగ్రత్తలు పాటించాలి

## జిల్లా వ్యాప్తంగా పటిష్ట పోలీస్ బందోబస్త్ తో పెట్రోలింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు.

## సన్ ప్రీత్ సింగ్ ఐపిఎస్, ఎస్పి సూర్యాపేట జిల్లా.

**కోదాడ డిసెంబర్ 29 క్రైమ్ మిర్రర్ :** నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకునే వారు జాగ్రత్తలు పాటించాలి, ప్రమాదాలకు దూరంగా ఉంటూ పిల్లలు పెద్దలు అందరూ వారి ఇండ్లలో ఉత్సవాలు జరుపుకోవాలి, పోలీసు వారి సూచనలు పాటించాలని జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఐపీఎస్ గారు ప్రజలకు సూచించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండ పోలీస్ శాఖ తరుపున భద్రత ఏర్పాట్లు చేయడం జరిగినది అని తెలిపారు. డిసెంబర్ 31 రాత్రి వేడుకలు, నిర్వహించుకునే నూతన సంవత్సర వేడుకల సందర్భంగా జిల్లా పోలీస్ యంత్రాంగం మొత్తం ముఖ్యంగా పటిష్ఠమైన బందోబస్త్, నిత్యం పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుంది. పట్టణ, గ్రామీణా ప్రాంతాల్లోను డ్రంక్ అండ్ డ్రైవింగ్ తనిఖీలు నిర్వహించబడుతాయని. అలాగే ప్రజలకు ఇబ్బందులకు గురిచేసే విధంగా బహిరంగ ప్రదేశాల్లో నూతన సంవత్సర వేడుకలను నిర్వహిస్తే వారిపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.




**పోలీసుల సూచనలు నిబంధనలు....**

- నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసుకునే కార్యక్రమాలు రాత్రి 12:30 గంటల వరకు పూర్తి కావాలి. తర్వాత కొనసాగిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటా0.
- పిల్లల పట్ల జాగ్రత్తలు పాటించాలి, మైనర్స్ కు వాహనాలు ఇవ్వవద్దు.
- టపాసులు, డీజే లు నిషేధం.
- మద్యం మత్తులో వాహనాలు నడపడం నేరం, వాహనాలు వేగంగా నడపవద్దు.
- రహదారులు బ్లాక్ చేసి ఉత్సవాలు చేయవద్దు.
- మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించేవద్దు.
- ఇతరులకు ఇబ్బంది కలిగించవద్దు.
- ఇల్లు, ప్రవేట్ ఆస్తులపై, వీధి దీపాల పై రాళ్లు వేయడం, అద్దాలను పగలగొట్టడం నేరం. .
- ర్యాష్ డ్రైవింగ్, బైక్ రేసింగ్, త్రిబుల్ రైడింగ్, సైలెన్సర్ లను తీసివేసి వాహనాలు నడపడం, శబ్ద కాలుష్యం చేస్తూ ఇతరులను ఇబ్బంది పెడితే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటా0.
- న్యూ ఇయర్ వేడుకలలో నిషేదిత డ్రగ్స్, గాంజా వంటి మత్తు పదార్థాలు విక్రయించిన, వినియోగించిన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.
- మద్యం దుకాణాలను నిర్ణీత సమయంలో క్లోజ్ చేయాలి, మైనర్లకు మద్యం అమ్మకూడదు.
- బహిరంగ ప్రదేశాల్లో, ప్రభుత్వ స్థలాల్లో మద్యం సేవిస్తే కేసులు పెడుతాం.
- మైనర్లు వాహనాలు వాహనాలు ఇవ్వవద్దు.
- ఈ నూతన సంవత్సర వేడుకుల సందర్భంగా ఎర్పాటు చేసే ఎలాంటి కార్యక్రమాలు అయన సరే నిర్వహకులు తప్పని సరిగా పోలీసు అధికారుల నుండి ముందస్తూ అనుమతులు తీసుకోవాలి.
- న్యూ ఇయర్ అఫర్ ల పేరిట సైబర్ నేరగాళ్లు ఆర్థిక నష్టం కలిగించే అవకాశం ఉన్నది కావున ఆన్లైన్ నందు, అపరిచితులతో వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ అకౌంట్ వివరాలు, పిన్ నబర్స్ లు ఇవ్వవద్దు.

అంక్షలను అతిక్రమిస్తే చర్యలు తప్పవు అని ఎస్పి గారు హెచ్చరించారు. అత్యవసర సమయంలో స్థానిక పోలీసు అధికారులకు, డయల్ 100 కు ఫోన్ చేసి పోలీసు సేవలు ఉపయోగించుకోవాలి అని ఎస్పి కోరారు.

# హుక్కా సెంటర్ పై పోలీసుల దాడులు




**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సుల్తాన్పూర్ లో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న హుక్కా సెంటర్ పై బాలాపూర్ పోలీసులు దాడులు చేశారు. బాలాపూర్ ఇన్స్పెక్టర్ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం సుల్తాన్పూర్ ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా హుక్కా సెంటర్ నిర్వహిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారంతో బాలాపూర్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ సుధాకర్ తన బృందంతో దాడులు నిర్వహించగా సెంటర్ నిర్వాహకుడు, మేనేజర్ షోయబ్ తో పాటు సోఫియా బాబా వయస్సు 26, సయ్యద్ మన్సూర్ వయస్సు 20, సయ్యద్ అస్లాం వయస్సు 19, షేక్ అలీ వయస్సు 22, మహమ్మద్ నూర్ వయస్సు 19 ఐదుగురు కస్టమర్లను అదుపులోకి పోలీసులు తీసుకోవడంతో పాటు వీరి వద్దనుండి 8 హుక్కా పాట్స్, 16 హుక్కా పైప్స్, 5 బ్రిక్ కోల్ బాక్సెస్, కోకోనట్ కోల్ బాక్స్, నాలుగు సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకొని కేసును దర్యాప్తు చేస్తున్నట్లు బాలాపూర్ పోలీసులు తెలిపారు.

# జహీరాబాద్ ఎంపీని కలిసిన పిట్లం కాంగ్రెస్ పార్టీ నాయకులు



**పిట్లం క్రైమ్ మిర్రర్ న్యూస్:** కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రంలోని వివేకానంద స్కూల్ లో జహీరాబాద్ ఎంపీ సురేష్ సెట్కార్ ఆదివారం పిట్లం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులను కలిశారు.ఈ సందర్భంగా జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్ చిల్లర్గి మాజీ జెడ్పిటిసి మురళీధర్ గౌడ్ కుమారుని వివాహ రిసెప్షన్ కార్యక్రమానికి వెళ్లే క్రమంలో పిట్లం మండల కేంద్రంలోని వివేకానంద స్కూల్ వద్ద ఆగి కాంగ్రెస్ కార్యకర్తలతో కాసేపు ముచ్చటించారు.కాంగ్రెస్ పార్టీ ప్రోగ్రాం అభివృద్ధి కొరకై చేపట్టవలసిన కార్యక్రమాలు,చర్యల గురించి నాయకులతో చర్చించారు.కాంగ్రెస్ పార్టీ బలోపేతం కొరకు తీసుకోవాల్సిన చర్యలు జాగ్రత్తల గురించి పిట్లం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులతో చర్చించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జంబిగా హనుమాన్లు,కాంగ్రెస్ సీనియర్ నాయకులు అడ్వకేట్ రామ్ రెడ్డి,నారాయణఖేడ్ ఆత్మ కమిటీ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుండు నరేందర్,పిట్లం వివేకానంద స్కూల్ కరస్పాండెంట్ రైతు కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు ఏనుగండ్ల శ్రీనివాస్ రెడ్డి,ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు రాజు రాథోడ్,యువజన నాయకులు ప్రవీణ్ కుమార్,మైనార్టీ నాయకులు బాష,తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ కృషితోపలు అభివృద్ధి పనులు

## కత్తి రవీందర్ రెడ్డి మండల పార్టీ అధ్యక్షుడు

**క్రైమ్ మిర్రర్ నాంపల్లి:** నాంపల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కృషితో పలు అభివృద్ధి పనులు మంజూరు చేయించి నందుకు మండల ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు. నాంపల్లి పట్టణ నాలుగు లైన్ల రోడ్ల అభివృద్ధికి, డ్రైనేజీ వ్యవస్థ, డి వైడరు, సెంట్రల్ లైటింగ్ అభివృద్ధికి 32.5 కోట్లు, సుంకి శాల ఆర్ అండ్ బి రోడ్డు టు వయా ముష్టిపల్లి సాగర్ హైవే వరకు 14 కోట్లు, పసునూరు టు సాగర్ డబుల్ రోడ్డు వయా వెంకటం పేట 25 కోట్లు, ఇడి కూడ నుండి సుంకి శాల వయా నాంపల్లి ఇరువైపులా సైడ్ డ్రై ఇన్స్

21 కోట్లు, ఇడి కూడ నుండి నాంపల్లి ద్వారా ముష్టిపల్లి వరకు బ్రిడ్జెస్ కు17 కోట్లు మొత్తం 109.5 కోట్ల రూపాయలను మంజూరు చేయించారు. అదేవిధంగాచిట్టం పాడు నుండి తిరుమలగిరి సి ఆర్ ఆర్ 2.80 కోట్లు, చిట్టెంపాడు నుండి దామెర భీమనపల్లి ఎక్స్ రోడ్ ఎం ఆర్ ఆర్ 2.60కోట్లు, గట్ల మల్లేపల్లి నుండి తుమ్మలపల్లి సి ఆర్ ఆర్ 2.60 కోట్లు, కేతపల్లి నుండి తిరుమలగిరి సి ఆర్ ఆర్ 1.5 కోట్లు, సుంకి శాల ఆర్ అండ్ బి రోడ్డు టు భీ టిపురం వరకు1.35 కోట్లు సి ఆర్ ఆర్ రోడ్లు, పంచాయతీ రాజ్ రోడ్లకు మొత్తం 10.85 కోట్లు సీసీ రోడ్స్ మండలంలో మహ్మ దాపురం అంగన్వాడి బిల్డింగ్

**బీటీపురం జిపి బిల్లింగ్'....**

2.20 కోట్లు, సి డి ఎఫ్ ఎమ్మెల్యే నిధులనుండి నీటి సరఫరా, బ్యాలెన్స్ బిల్డింగ్ వర్క్స్, మోడల్ స్కూల్ లో కిచెన్ షెడ్ 1 కోటి, ఎంపీ నిధుల నుండి స్ట్రీట్ లైట్స్ 9 లక్షలు, నాంపల్లి మండలం విద్యుత్ సమస్యల కోసం...,ముష్టిపల్లి సబ్ స్టేషన్ 3 కోట్లు, నరసింహులు గూడెం సబ్ స్టేషన్ 3 కోట్లు, మహ్మదాపురం సబ్ స్టేషన్ ప్రపోజల్ 3 కోట్లు, నాంపల్లి మండలంలోని డ్యామేజి పోల్స్ కొత్త లైన్స్ కొత్త ట్రాన్స్ఫార్మర్స్ లూస్ లైన్స్ కింద 5.5 కోట్లు విద్యుత్ కు మొత్తము 14.5 కోట్లు, మన ఊరు మన బడి మండల మొత్తము 3 కోట్లు, సీఎంఆర్ఎఫ్ చెక్కులు 5947500 రూపాల ఎల్ వో సి లు కేటాయించినారు. పది లక్షలు పై నిధులే కాకుండా బంగారు గడ్డ నుండి సుంకిశాల వయా నాంపల్లి ఆర్ అండ్ బి రోడ్డు వరకు 53 కోట్ల రూపాయలు పరిపాలన ఫైనాన్స్ ఆమోదము పొంది రాజగోపాల్ రెడ్డి చొరవతో పనులు వేగవంతం చేయించడం జరిగిందని ఈ పనులన్నీ కూడా ఒక సంవత్సరం కాలంలో నాంపల్లి మండల పరిధిలోని జరిగినటు వంటి అభివృద్ధి కి సహకరించి పోరాడిన నాంపల్లి మండల కాంగ్రెస్ పార్టీ



కార్యకర్తలు ముఖ్య నాయకులు, సీనియర్ నాయకులు రాజన్న అభిమానులు పార్టీ అభిమానులు అందరి తరపున కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కి మండల పార్టీ అధ్యక్షుడు కత్తి రవీందర్ రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. అదే విధంగా మునుముందు కూడా మండల అభివృద్ధి సహకరించగలరని కోరారు.

# మాది భయపడే బ్లడ్ కాదు

**కేసులు పెడితే బెదిరిటోళ్లం కాదు**

**ఉద్యమాలు చేసి రాష్ట్రం తెచ్చినోళ్లం**

**నిప్పులాంటి నిజామాబాద్ బిడ్డను..**


**కాంగ్రెస్ పాలనలో నోరు తెరిస్తే పోలీసు కేసు**

**తెలంగాణ తల్లి మాది.. కాంగ్రెస్ తల్లి మీది**

**నిజామాబాద్ పర్యటనలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**

నిజామాబాద్: 'కేసీఆర్‌ను ఎదుర్కొనే దమ్ము, ధైర్యం లేక కేసీఆర్ బిడ్డలమైన రామన్న మీద, నా మీద కేసులు పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. మాది భయపడే బ్లడ్ కాదు. భయపెట్టే బ్లడ్..' అని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వ్యాఖ్యానించారు. 'ఎట్టి పరిస్థితుల్లోనైనా మేమెవ్వరికీ భయపడేది లేదు. మేము తప్పు చేయలేదు. నామీద, రామన్న మీద, బీఆర్ఎస్ నాయకులపై ఎన్ని కేసులు పెట్టినా.. నిప్పు కణికల్లా బయటికి వస్తాం..' అంటూ స్పష్టంచేశారు. 'ఎందుకు అయితున్నయి కేసులు ఇయ్యాలా? కేంద్రాన్ని ఎదురించి మాట్లాడితే కేసు. చైనా వాడు బార్డర్ దాటి లోపలికి వచ్చిండంటే కేసు. ప్రజలకు మంచి జరుగతలేదంటే కేసు. ముఖ్యమంత్రి పేరు మరిచిపోతే కేసు, రైతు తన భూమి ఇయ్యకపోతే కేసు, ఫేస్‌బుక్‌లో పోస్టు పెడితే కేసు, ట్విట్టర్‌లో ప్రొఫెసర్లు అభిప్రాయం చెప్తే కేసు, ఇన్‌స్టాలో అక్కాచెల్లెళ్లు వీడియో పెడితే కేసు..' అంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును కవిత ఎండగట్టారు. ముఖ్యమంత్రికి గింత భయమెందుకు? నిజాన్ని ఫేస్ చేయలేరా? అని ప్రశ్నించారు.

ఢిల్లీ లిక్కర్ కేసులో బెయిల్‌పై విడుదలైన అనంతరం నిజామాబాద్ జిల్లాకు తొలిసారిగా ఆదివారం కవిత వచ్చారు. ఈ సందర్భంగా 44వ నంబర్ జాతీయ రహదారి ఇందల్వాయి టోల్‌ప్లాజా దగ్గరి నుంచి నిజామాబాద్ నగరం వరకు కవితకు ఘన స్వాగతం లభించింది. బీఆర్ఎస్ శ్రేణులు, భారత జాగృతి నాయకులు, కవిత అభిమానులు దారి పొడవునా అపూర్వ స్వాగతం పలికారు. సుభాష్‌నగర్‌లోని ఉద్యమకాలం నాటి తెలంగాణతల్లి విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన వేదికపై ప్రజలనుద్దేశించి మాట్లాడారు. 'బరువు ఎత్తుకున్నోడు.. బాధ్యత ఉన్నోడు. ఓపికతో ఉండాలె. ప్రజలకు ఇబ్బంది ఉంటే పరిష్కారం చేస్తావనే బాధ్యత ఇచ్చారు. అల్లాటప్పాగా టైం పాస్‌కు అధికారం ఇయ్యరు. ఆ విషయాన్ని మరిచిపోయి ఎదురు మాట్లాడితే కేసులు పెడుతున్నరు' అని



కవిత మండిపడ్డారు.కేసులు మమ్మల్ని భయపెట్టలేవు. ఉద్యమాలు చేసి తెలంగాణ తెచ్చినోళ్లం. గులాబీ పార్టీ వాళ్లం. గట్టిగా నిలబడతాం. ప్రజల పక్షాన కొట్లాడుతాం.ఎన్ని ఇబ్బందులు, కష్టాలు ఎదురైనా తాను నిప్పులాంటి నిజామాబాద్ బిడ్డను అని, పిడికిలి ఎత్తి అన్నీ ఎదురించి ఇక్కడికి వచ్చానంటూ ఎమ్మెల్సీ కవిత చెప్పారు. కష్టకాలంలో తనకు మద్దతు ఇచ్చినందుకు ప్రజలందరికీ వేదిక పైనుంచి భావోద్వేగంతో ధన్యవాదాలు తెలియజేశారు. సుభాష్‌నగర్‌లో తెలంగాణతల్లి విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన సభా ప్రాంగణానికి బతుకమ్మ, బోనాలు, గొంగడి, వలలు, గొర్రె పిల్లలతో భారీగా తరలి వచ్చిన అభిమానులను చూసి కవిత మురిసిపోయారు. దసరా లెక్క అనిపిస్తున్నదని, మిట్ట మధ్యాహ్నం ఎండ కొడుతుంటే వెన్నెల్లో నిల్చున్నట్టు, నవ్వుతుంటే మనసు పులకరిస్తున్నదని చెప్పారు. డిగ్రీ చదివినవారు పెద్ద సంఖ్యలో ఈ సభకు రాగా వారిని ఉద్దేశించి స్కూటీలు వచ్చాయా? అని కవిత ప్రశ్నించారు. రాలేదంటూ వారంతా చేతులు ఊపారు.

క్రైమ్ THE మిర్రర్®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు


# సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల ఇల్లు..
# ఇదే కొత్త ట్రెండు!







సొంతిల్లు ప్రతి ఒక్కరి స్వప్నం.. దానికి తగ్గట్టుగానే ఇంటిని అభిరుచికి తగ్గట్లు నిర్మించుకోవడంతో పాటు సరికొత్త ఇంటీరియర్ ఏర్పాటు చేసుకుంటున్నారు. విల్లా, ఫ్లాట్, ఇండిపెండెంట్ హౌజ్ ఇలా ఏదైనా సరే.. కొత్తదనం కొట్టొచ్చినట్లు కనిపించేలా తీర్చిదిద్దుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు నగరవాసులు. ఇంట్లోకి అడుగు పెట్టగానే వావ్ అనిపించేలా హాల్, మోడ్రన్ కిచెన్, బెడ్రూమ్స్‌తో పాటు బాల్కనీని ముస్తాబు చేసుకుంటున్నారు. కాఫీ కప్పుతో అలా బాల్కనీలోకి వెళ్తే మనసుకు హాయినిచ్చేలా మలుచుకుంటున్నారు. చాలామంది గ్రీనరీ ఫీల్ కోసం ప్రత్యేకంగా ఆర్టిఫిషియల్ లాన్ ఏర్పాటు చేసుకొని అందమైన మొక్కలతో అలంకరిస్తున్నారు. బాల్కనీ, పెంట్‌హౌస్ సైజును దృష్టిలో ఉంచుకొని కొన్ని సంస్థలు ప్రత్యేక డిజైన్లతో మైమరపిస్తున్నాయి.

కరోనా కాలం తర్వాత నగరవాసులు ఎన్నో నూతన ఒరవడుల వైపు ఆసక్తి కనబరిచారు. ముఖ్యంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు (software employవవం%) ఇలాంటి వాటికి అధికంగా మొగ్గుచూపారు. దీనికి ఓ కారణం ఉంది.. లాక్‌డౌన్ తర్వాత వర్క్ ఫ్రమ్ హెూమ్ కారణంగా అధిక సంఖ్యలో ఉద్యోగులు ఇళ్లలో ఉండటం, వర్క్ స్ట్రెస్ తగ్గించుకోవడం కోసం ఇంట్లో ఇంటీరియర్‌తో పాటు బాల్కనీ ఆహ్లాదకరంగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. వర్క్ మధ్యలో ఫ్యామిలీతో అలా బాల్కనీ, పెంట్‌హౌస్‌లో కూర్చొని సరదాగా కాసేపు గడిపి మళ్లీ పని చేసుకుంటున్నారు. నగరంలో వేగంగా విస్తరిస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారంతో సమానంగా ఇంటీరియర్, పలు థీమ్స్‌తో కొన్ని సంస్థలు రంగంలోకి దిగాయి. ఇప్పటి వరకు ఒకలా.. ఇప్పటి నుంచి మరోలా అనే విధంగా ముస్తాబు చేస్తున్నాయి.

**అపార్ట్‌మెంట్స్ బాల్కనీ..**

అపార్ట్‌మెంట్ బాల్కనీ కొద్ది స్పేస్ అయినా వాటిని మరింత సుందరీకరణకు మొగ్గు చూపుతున్నారు. కొందరు వారికి నచ్చిన థీమ్స్‌తో డిజైన్ చేయించుకుంటారు. థీమ్ నేమ్స్, లైటింగ్ కొటేషన్స్, సేఫ్టీ కోసం ఇన్‌విజిబుల్ గ్రిల్స్, వాల్ ఆర్ట్‌ను ఎంచుకుంటున్నారు. వర్క్‌ఫ్రమ్ హెూమ్ ఉన్న వారు బాల్కానీని ఆఫీస్ థీమ్స్‌తో పాటు పలు విభిన్న థీమ్స్‌తో సిటీ వ్యూ చూస్తూ డిజైన్స్ కోరుకుంటున్నారు. పిల్లలకు స్టడీస్ ఇంట్రెస్ట్ రావడానికి సరికొత్త డిజైన్స్ ఎంచుకుంటున్నారు. గ్రీనరీతో పాటు ఉన్న స్పేస్‌లో మొక్కలు, రెండు మూడు రకాల కూరగాయలు పెంచుతున్నారు. త్రీ బెడ్‌రూమ్స్‌లో ఒక బెడ్‌రూమ్‌లో కొత్త థీమ్స్‌కి ఇంపార్టెన్స్ ఇస్తున్నారు. విల్లాస్ కల్చర్ పెరిగింది. పెంట్‌హౌస్‌లో ఉన్న స్పేస్‌కి చాలా ఖర్చు పెడుతున్నారు. సిటీ వ్యూ కనబడేలా అవుట్ డోర్ స్విమ్మింగ్ పూల్, జెకూజీ, బార్ కౌంటర్, హెూమ్ థియేటర్ తదితర సౌకర్యాలు ఏర్పాటు చేసుకుంటున్నారు.




అదిరిపోయే లుక్‌లో మారుతి కొత్త కార్లు..

## 2025లో వచ్చేస్తున్నాయి

### 2025లో నాలుగు కార్లను విడుదల చేయనున్న సంస్థ

న్యూఢిల్లీ: కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ టాప్‌గేర్‌లో దూసుకుపోతున్నది. ఇప్పటికే కొనుగోలుదారులను ఆకట్టుకోవడానికి అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్న సంస్థ..కొత్త ఏడాదిలో నయా మాడళ్లను విడుదల చేయబోతున్నది. ఢిల్లీ వేదికగా జరగనున్న వాహన పండుగలో ఈ కొత్త మాడళ్లను ప్రదర్శిస్తున్నది. వీటిలో తొలి ఎలక్ట్రిక్ వాహనంతోపాటు మూడు ఎస్‌యూవీ మాడళ్లు ఉన్నాయి. మారుతి ఈ-విటారా:దేశీయంగా ఈవీ కార్లకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని మారుతి కూడా ఈ మాడళ్లను విడుదల చేయడానికి సిద్ధమైంది. వచ్చే నెలలో 17 నుంచి 22 వరకు ఢిల్లీలో జరుగుతున్న భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025లో తన తొలి ఈ-విటారాను ప్రదర్శించబోతున్నట్లు తెలుస్తున్నది. 49 కిలోవాట్లు, 61 కిలోవాట్లా బ్యాటరీ సామర్థ్యంతో రూపొందించిన ఈ కారు ధర రూ.22 లక్షల స్థాయిలో ఉంటుందని అంచనా. సింగిల్ చార్జింగ్‌తో 550 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. 10.25 ఇంచుల టచ్‌స్క్రీన్ ఇన్ఫోసిస్టమ్, ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, టైర్ ప్రెషర్ మానిటరింగ్ సిస్టమ్, 360-డిగ్రీల కెమెరా వంటి ఫీచర్స్ ఉన్నాయి.

**నయా గ్రాండ్ విటారా**

కాంప్యాక్ట్ ఎస్‌యూవీ సెగ్మెంట్‌ను మరింత బలోపేతం చేయడానికి నయా గ్రాండ్ విటారాను అందుబాటులోకి తీసుకురాబోతున్నది. వచ్చే ఏడాది జూన్‌లో ప్రవేశపెట్టనున్న ఈ కారును సరికొత్తగా తీర్చిదిద్దినట్లు,ముఖ్యంగా ఇంటీరియర్ డిజైనింగ్, డ్యాష్‌బోర్డ్, ఐదు-ఏడుగురు కూర్చోవడానికి విధంగా డిజైన్ చేసింది.

**కొత్త బాలెనో**

ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ బాలెనోను మరింత ఆధునీకరించి విడుదల చేయడానికి సిద్ధమైంది మారుతి. మార్చి నెలలో అందుబాటులోకి రానున్న ఈ కారులో అతిపెద్ద టచ్‌స్క్రీన్, ఫుల్ డిజిటల్ డ్రైవర్ డిస్‌ప్లే,సింగిల్-ప్యాన్ సన్‌రూఫ్, వైర్‌లెస్ ఫోన్ చార్జర్, టైర్-ప్రెషర్ మానటరింగ్ సిస్టమ్, ఆరు ఎయిర్‌బ్యాగ్‌లతో తీర్చిదిద్దింది.

**అప్‌గ్రేడ్ బ్రెజ్జా**

మూడేండ్ల క్రితం అందుబాటులోకి తీసుకొచ్చిన బ్రెజ్జాను మళ్లీ ఆధునీకరించి మార్కెట్లో విడుదల చేయబోతున్నది సంస్థ. స్కోడా కైలాక్, కియా సైరోస్‌ల నుంచి ఎదురవుతున్న పోటీని తట్టుకోవడానికి ఈ నయా మాడల్‌ను తెస్తున్నది.

## హెచ్‌బీవో ఫౌండర్ చార్లెస్ డోలన్ కన్నుమూత




కేబుల్ టీవీ దిగ్గజం, హెచ్‌బీవో టీవీ చానెల్ వ్యవస్థాపకుడు చార్లెస్ డోలన్ కన్నుమూశారు. 98 ఏళ్ల వయసులో ఆయన సహజ కారణాలతో శనివారం (డిసెంబర్ 28) తుదిశ్వాస విడిచారని కుటుంబ సభ్యులు ధ్రువీకరించినట్లుగా స్థానిక న్యూస్ పోర్టల్ న్యూస్‌డే పేర్కొంది.చార్లెస్ డోలన్ 1972లో హెచ్‌బీవోని స్థాపించారు. తర్వాత ఏడాదిలోనే దేశంలోని అతిపెద్ద కేబుల్ ఆపరేటర్‌లలో ఒకటైన కేబుల్‌విజన్‌ని సృష్టించారు. దీన్ని 2017లో ఆల్టిస్‌కి 17.7 బిలియన్ డాలర్లకు విక్రయించారు. 1986లో ఆయన కేబుల్‌విజన్ న్యూస్ 12 లాంగ్ ఐలాండ్‌ను ప్రారంభించడంలో కీలకపాత్ర పోషించారు. యూఎస్‌లో ఇది తొలి 24 గంటల ప్రాంతీయ కేబుల్ న్యూస్ ఛానెల్. తర్వాత ఇది న్యూయార్క్ ప్రాంతంలో స్థానిక వార్తా ఛానెల్‌ల న్యూస్ 12 నెట్‌వర్క్‌ల సమూహానికి దారితీసింది. కేబుల్‌విజన్ నుండి ప్రత్యేక పబ్లిక్ కంపెనీగా విడిపోయిన ఏఎంసీ నెట్‌వర్క్స్ డైరెక్టర్ల బోర్డు ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా ఉన్న చార్లెస్ డోలన్ 2020లో ఆ పదవి నుంచి వైదొలిగారు.డోలన్ భార్య కూడా కొన్ని నెలల క్రితమే మరణించారు. వీరికి ఆరుగురు సంతానం ఉన్నారు. వీరిలో పాట్రిక్ డోలన్ న్యూస్‌డే సంస్థను నడిపిస్తున్నారు. మరో కుమారుడు జేమ్స్ డోలన్ భార్య క్రిస్టిన్ డోలన్ ఏఎంసీ నెట్‌వర్క్స్ సీఈవోగా ఉన్నారు.దూసుకుపోతున్న క్రిప్టో కరెన్సీ బిట్‌కాయిన్ మూలాలపై హెచ్‌బీవో ఇటీవల ఓ సంచలనాత్మక డాక్యుమెంటరీ చిత్రీకరించింది. వాటిని తొలిసారి చేసిన వ్యక్తిగా ఇప్పటివరకు సతోషి నకమోటో పేరు చాలామందికి తెలుసు. కానీ కెనడాకు చెందిన పీటర్ టోడ్డ్ అనే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ తొలిసారి బిట్‌కాయిన్ తయారుచేశాడంటూ 'మనీ ఎలక్ట్రిక్: బిట్‌కాయిన్ మిస్టరీ' పేరిట 100 నిమిషాల నిడివితో నిర్మించిన ఈ చిత్రాన్ని విడుదల చేసింది.

## పది నిమిషాలకో లగ్జరీ కారు సేల్..
## ప్రీమియం కార్లపై పెరుగుతున్న మోజు..!



కరోనా మహమ్మారి తర్వాత ప్రతి ఒక్కరూ పర్సనల్ మొబిలిటీకి ప్రాధాన్యం ఇస్తున్నారు. అందునా స్పేసియస్‌గా ఉండే ఎస్ యూవీ కార్లతోపాటు లగ్జరీ కార్ల పైనా మోజు పారేసుకుంటున్నారు. 2024లో ప్రతి గంటకు ఆరు రూ.50 లక్షలపై చిలుకు ధర గల లగ్జరీ కార్లు కొనుగోలు చేశారు. ఐదేండ్ల క్రితం గంటకు రెండు లగ్జరీ కార్లు మాత్రమే అమ్ముడయ్యేవి. సంపన్న వినియోగదారుల పునాది క్రమంగా పెరుగుతుండటంతో ప్రీమియం కార్లకు గిరాకీ పెరుగుతోంది. లగ్జరీ కార్లకు పెరుగుతున్న డిమాండ్‌ను గమనించిన కార్ల తయారీ సంస్థలు 2025లో రెండు డజన్లకు పైగా కొత్త మోడల్ కార్లను ఆవిష్కరించేందుకు సిద్ధం చేసుకుంటున్నాయి. బేస్ పెరుగుతున్నా కొద్దీ.. 50 వేల కార్లు అమ్ముడవుతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు.లగ్జరీ కార్లలో ఒకటైన ఆడీ ఇండియా అధిపతి బల్బీర్ సింగ్ ధిల్లాన్ మాట్లాడుతూ కరోనా తర్వాత ప్రీమియం కార్లకు గిరాకీ పెరిగిందన్నారు. 2025లో లగ్జరీ కార్ల మార్కెట్ 8-10 శాతం పెరుగుతుందని అంచనా వేశారు. మెర్సిడెజ్ బెంజ్ ఇండియా ఎండీ కం సీఈఓ సంతోష్ అయ్యర్ మాట్లాడుతూ స్థిరమైన ఆర్థిక ఫలితాలతోపాటు వినియోగదారుల సానుకూల సెంటిమెంట్ వల్ల లగ్జరీ కార్ల మార్కెట్ పెరుగుతుందన్నారు.దేశీయంగా లగ్జరీ కార్ల విక్రయాల్లో మెర్సిడెజ్-బెంజ్ ముందు వరుసలో నిలిచింది. 2024లో దాదాపు 20 వేల యూనిట్ల కార్లు అమ్ముడవుతాయని కంపెనీ యాజమాన్యం భావిస్తున్నది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది 13 శాతం వృద్ధిరేటు ఉంటుందని తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి తొమ్మిది నెలల్లో 14,379 యూనిట్లు అమ్ముడయ్యాయి. పెరుగుతున్న గిరాకికి అనుగుణంగా 2025లో కొత్త కార్ల ఆవిష్కరణతోపాటు మార్కెట్ విస్తరణకు ప్రణాళిక సిద్ధం చేసింది.బీఎండబ్ల్యూ ఇండియా సైతం ఐదు శాతం సేల్స్ పెంచుకున్నది. 2024 జనవరి నుంచి సెప్టెంబర్ మధ్య 10,556 కార్లు విక్రయించింది. ఆడి ఇండియా సేల్స్ 16 శాతం తగ్గాయి. సప్లయ్ చైన్‌లో ఇబ్బందుల వల్లే ఈ పరిస్థితి నెలకొందని, 2025లో రికవరీకి కొత్త ఉత్పత్తులను ఆవిష్కరిస్తామని ఆడి ఇండియా చెబుతోంది. గతేడాదితో పోలిస్తే లగ్జరీ కార్ల విక్రయాలు పెరిగినా.. మొత్తం కార్ల విక్రయాల్లో వీటి వాటా ఒక శాతం పై చిలుకే. ప్రధాన గ్లోబల్ ఎకానమీల్లో భారత్‌లో లగ్జరీ కార్ల విక్రయాలు తక్కువ.నైట్ ఫ్రాంక్ వెల్త్ రిపోర్ట్ -2024 ప్రకారం ప్రపంచవ్యాప్తంగా భారత్‌లోనే అత్యధిక నికర సంపద పెంచుకున్న బిలియనీర్ల సంఖ్య పెరుగుతోంది. 2023లో భారత బిలియనీర్ల సంఖ్య 13,263 నుంచి 2024లో 50 శాతం పెరిగి 19,908లకు చేరుకుంది. చైనా, తుర్కియే, మలేషియాలను కూడా భారత్ దాటేసింది. సంపన్న వర్గం పెరిగినా కొద్దీ లగ్జరీ కార్లకు గిరాకీ పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. 2020లో 20,500 లగ్జరీ కార్లు అమ్ముడైతే, 2021లో 28,600, 2022లో 38 వేలు, 2023లో 48 వేల లగ్జరీ కార్లు అమ్ముడయ్యాయి.

## ఫండ్లలో మహిళా ఇన్వెస్టర్ల జోరు..
## ఏడాదిలో రెండున్నర రెట్లు పెరిగిన సంఖ్య

న్యూఢిల్లీ: దేశీయ మ్యూచువల్ ఫండ్ ఇండస్ట్రీలో మహిళా పెట్టుబడిదారులు భారీగా పెరుగుతున్నారు. ప్రస్తుత సంవత్సరంలో చిన్న, మధ్యస్థాయి నగరాల నుంచి అత్యధిక మంది మహిళలు ఫండ్లలో ఇన్వెస్ట్ చేస్తున్నారని, గడిచిన ఏడాదికాలంలో వీరి సంఖ్య రెండున్నర రెట్లు పెరిగినట్లు ఆన్‌లైన్ బ్రోకరేజ్ సంస్థ గ్రోవ్ తెలిపింది. మహిళల్లో ఆర్థిక స్వావలంభన పెరుగుతున్నదని, ముఖ్యంగా పట్టణ, అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలతోపాటు చిన్న స్థాయి నగరాల్లో సైతం 140 శాతం పెరిగిందని, దీంతో వీరు ఈక్విటీ మార్కెట్లతోపాటు ఎంఎఫ్ మార్కెట్లలో విరివిగా పెట్టుబడులు పెడుతున్నట్లు వెల్లడించింది. మిగతా రంగాలకు దూరంగా ఉంటున్న మహిళలు..ఈక్విటీ, ఫండ్లలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నట్లు, ఈ ఏడాది కోటి మందికి పైకి చేరుకున్నారని గ్రోవ్ కో-ఫౌండర్, సీఈవో లలిత్ కేశ్రా తెలిపారు. గడిచిన ఏడాదికాలంలో మెట్రో, టైర్-1,2,3 నగరాల్లో ఫండ్లలో పెట్టుబడులు పెట్టే మహిళలు 100 శాతం చొప్పున పెరిగారు. నగరాల వారీగా చూస్తే ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, పూణె, లక్నో, అహ్మదాబాద్, జైపూర్ వంటి మెట్రో నగరాల నుంచి అత్యధిక మంది మహిళలు మ్యూచువల్ ఫండ్లలో ఇన్వెస్ట్ చేశారు. అలాగే పురుషుల కంటే సిప్‌లలో మహిళలు అత్యధికంగా పెట్టుబడులు పెట్టడం విశేషం. ఈ ఏడాది మ్యూచువల్ ఫండ్ ఇండస్ట్రీ ఏయూఎం రూ.17 లక్షల కోట్ల మేర పెరిగిందని ఆంఫీ తెలిపింది. డిసెంబర్ 2023లో రూ.50.79 లక్షల కోట్లుగా ఉన్న ఫండ్ ఆస్తుల విలువ ప్రస్తుతం రూ.68 లక్షల కోట్లకు చేరుకున్నది. అలాగే గత నెలలో దేశీయ స్టాక్ మార్కెట్లో కొత్తగా 42.76 లక్షల మంది చేరారు. అలాగే గడిచిన నాలుగేండ్లుగా ప్రతియేటా 3 కోట్ల డీమ్యాట్ ఖాతాలు ప్రారంభిస్తున్నారు.



Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.

# మహేశ్‌బాబు మూవీలో ప్రియాంక చోప్రా

మహేశ్ బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రానున్న ఓ చిత్రంలో ప్రియాంక చోప్రా ఛాన్స్ కొట్టేసింది. ఎంబి29'గా ఇది ప్రచారంలో ఉంది. ప్రస్తుతం సినీ ప్రియులంతా ఎదురుచూస్తున్న చిత్రాల్లో ఇదీ ఒకటి. తాజాగా దీనికి సంబంధించిన కొన్ని అప్‌డేట్‌లు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఇండోనేషియా నటి చెల్సియా ఎలిజబెత్ ఇస్లాన్ ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటించనున్నట్లు గతంలో వార్తలు జోరుగా ప్రచారం అయ్యాయి. ఇప్పుడు మరో నటి పేరు తెరపైకి వచ్చింది. బాలీవుడ్ టాలెంటెడ్ హీరోయిన్ ప్రియాంక చోప్రా ఈ సినిమాలో నటించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఆమెతో చర్చలు జరిపినట్లు టాక్ వినిపిస్తుంది. ఇందులో హీరోతోపాటు హీరోయిన్ పాత్రకు ప్రాధాన్యం ఉంటుందని ప్రియాంక అయితే ఆ పాత్రకు న్యాయం చేయగలదని చిత్రబృందం భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే ఆమెను తీసుకునే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. ప్రియాంక కూడా ఈ సినిమాలో నటించేందుకు ఆసక్తిగా ఉన్నారట. ఈ పాత్ర కోసం ఇప్పటికే ఆమె ప్రిపరేషన్ కూడా మొదలుపెట్టారట. ఇక ఈ సినిమా షూటింగ్‌కు సంబంధించిన అప్‌డేట్ కూడా సోషల్ మీడియాలో షేర్ అవుతోంది. ఏప్రిల్ నుంచి ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు.





# 'ఆర్ఆర్ఆర్ బిహైండ్ అండ్ బియాండ్'

## మేకింగ్ టీమ్‌ను అభినందించిన రాజమౌళి

'ఆర్ఆర్ఆర్: బిహైండ్ అండ్ బియాండ్' కోసం వర్క్ చేసిన టీమ్‌ను ఉద్దేశించి అభినందిస్తూ..దర్శకుడు రాజమౌళి తాజాగా ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. టీమ్ పనితనాన్ని ఆయన మెచ్చుకున్నారు. అందరూ అద్భుతంగా పని చేశారని అన్నారు. 'దాదాపు 13 ఏళ్ల క్రితం ప్రదీప్‌ను కలిశా. ఒక అభిమానిగా అతడు నాకు అప్పుడు తెలుసు. ఈరోజు ప్రదీప్‌తోపాటు వాల్స్ అండ్ ట్రెండ్స్‌లోని అతడి టీమ్ 'ఆర్ఆర్ఆర్: బిహైండ్ అండ్ బియాండ్' కోసం ఎంతో వర్క్ చేశారు. మరో ఫ్యాన్ గర్ల్ శిరీష, వంశీ మంచి టాలెంట్ ఉన్న ఎడిటర్లు. 20టీబీ డేటాలో సరైన ఫుటేజ్‌ను కనుగొనడం అంత సులభమైన విషయం కాదు. సినిమా కంటే డాక్యుమెంటరీ చాలా ఎమోషనల్‌గా ఉందని వస్తోన్న ప్రశంసలే వారి ప్రతిభకు నిదర్శనం. టీమ్ విషయంలో చాలా గర్వంగా ఉన్నా. వీళ్లందరూ మరెన్నో ఉన్నత శిఖరాలను అందుకోవాలని కోరుకుంటున్నా' అని రాజమౌళి పేర్కొన్నారు. భారతీయ సినిమా ఖ్యాతిని ప్రపంచదేశాలకు వ్యాప్తి చేసిన చిత్రం 'ఆర్ఆర్ఆర్' . రామ్‌చరణ్, ఎన్టీఆర్ ప్రధాన పాత్రల్లో దర్శక ధీరుడు రాజమౌళి తెరకెక్కించిన ఈ చిత్రం 2022లో విడుదలై ప్రపంచవ్యాప్తంగా భారీ వసూళ్లు రాబట్టిన విషయం తెలిసిందే. ప్రతిష్ఠాత్మకంగా భావించే ఆస్కార్ (నాటు నాటు పాటకు) అవార్డు కూడా సొంతం చేసుకుంది. ఈ సినిమా చిత్రీకరణ విశేషాలను తెలియజేస్తూ ఇటీవల చిత్రబృందం 'ఆర్ఆర్ఆర్: బిహైండ్ అండ్ బియాండ్' అనే డాక్యుమెంటరీ సిద్ధం చేసింది. తాజాగా ఇది నెట్‌ఫ్లిక్స్ వేదికగా విడుదలైంది. సినిమాలోని కీలక సన్నివేశాల చిత్రీకరణ, షూటింగ్‌లో చోటుచేసుకున్న సరదా మూమెంట్స్, నటీనటులు, దర్శక నిర్మాతల అనుభవాలతో ఈ డాక్యుమెంటరీ రూపుదిద్దుకుంది. దీనిని చూసిన ప్రతిఒక్కరూ టీమ్‌ను ఎంతగానో మెచ్చుకుంటున్నారు. సినిమాతో పోలిస్తే డాక్యుమెంటరీ ఎంతగానో మనసుని హత్తుకుందని పలువురు పేర్కొంటున్నారు. అంతేకాకుండా, డాక్యుమెంటరీ విభాగంలో ఇది కనుక ఆస్కార్‌కు వెళితే తప్పకుండా అవార్డు వస్తుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



# మార్కో తెలుగు ట్రైలర్ విడుదల




ఉన్ని ముకుందన్ కథానాయకుడిగా హనీఫ్ దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ థ్రిల్లర్ 'మార్కో' ఇటీవల మలయాళంలో విడుదలైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తోంది. రూ. 30కోట్లతో నిర్మించిన ఈ చిత్రం విడుదలైన వారంలో రోజుల్లోనే రూ. 80కోట్లకు పైగా వసూలు చేసినట్లు ట్రేడ్ వర్గాలు లెక్కగట్టాయి. ఇప్పుడు తెలుగు ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమైంది. నూతన సంవత్సరం సందర్భంగా జనవరి 1న ఈ చిత్రం విడుదల కానుంది. తాజాగా చిత్ర ట్రైలర్ విడుదలైంది. యాక్షన్ సన్నివేశాలను పెద్ద పీట వేసినట్లు ప్రచార చిత్రాలు చూస్తే అర్థమవుతోంది.

# బేబీ బంప్ ఫోటోలతో సామ్ హల్‌చల్

టాలీవుడ్ స్టార్ నటి సమంత గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. తన అందం, అభినయంతోపాటు నటనతో కోట్లాది మంది అభిమానుల్ని సొంతం చేసుకుంది. ఏమాయ చేశావే చిత్రంతో తెలుగు ఇండస్ట్రీకి పరిచయమైన ఈ సుందరి.. అతి కొద్ది రోజుల్లోనే స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకుంది. అనంతరం మంచి ఫామ్‌లో ఉండగానే టాలీవుడ్ నటుడు నాగచైతన్యను ప్రేమపెళ్లి చేసుకుంది. ప్రస్తుతం అతడితో విడాకులు తీసుకుని సింగిల్‌గా ఉంటోంది. ఈ క్రమంలో సమంతకు సంబంధించిన కొన్ని ఫొటోలు ప్రస్తుతం నెట్టింట షేక్ చేస్తున్నాయి. ఆ ఫొటోల్లో సామ్ బేబీ బంప్ తో కనిపించడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. అయితే, అవి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో రూపొందించినవిగా తెలిసింది. ఏఐ సాయంతో సమంత బేబీ బంప్ ఫొటోలను క్రియేట్ చేసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఇవి కాస్తా వైరల్ కావడంతో నెటిజన్లు, అభిమానులు షాక్ అవుతున్నారు. నాగచైతన్యతో విడాకుల అనంతరం మాతృత్వాన్ని అనుభవించాలని ఉందంటూ సామ్ అప్పట్లో చెప్పుకొచ్చిన విషయం తెలిసిందే. ఇప్పుడు బేబీ బంప్ ఫొటోలు చూసిన వారంతా ఈ విషయాన్నే గుర్తు చేసుకుంటున్నారు.




# పుష్ప-2 నుంచి షెకావత్ పాట విడుదల

అల్లు అర్జున్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'పుష్ప 2 ది రూల్' సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాలో రష్మిక కథానాయిక నటించింది. డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే వరల్డ్ వైడ్‌గా రూ. 1700 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది ఈ చిత్రం. అయితే ఈ మూవీ నుంచి ఫుల్ వీడియో సాంగ్‌లను ఒక్కొక్కటిగా వదులుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే 'పుష్ప రాజ్' సాంగ్‌తో పాటు 'దెబ్బలు పడతాయ్ రో.. దెబదెబ్బలు పడతాయ్ రో.. కిస్ కిస్ కిస్సిక్' సాంగ్‌లను విడుదల చేసిన చిత్రబృందం తాజాగా మూవీలో ఇంటర్వెల్ ముందు వచ్చే దమ్ముంటే పట్టుకోరా షెకావత్ పట్టుకుంటే వదిలేస్తా సిండికేట్ అనే సాంగ్‌ను విడుదల చేసింది. థియేటర్‌లో ఉర్రుతలు ఊగించిన ఈ సాంగ్ విడుదలయ్యింది.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.